క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నడిగూడెం : నడిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నడిగూడెం, రత్నవరం, కరివిరాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కాగితరామచంద్రాపురం గ్రామాలకు సోమవారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె.సైదయ్య ఆదివారం తెలిపారు. ఆయా గ్రామాలలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగింపులో భాగంగా సరఫరా నిలిపివేయనున్నట్లు, అందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనంతగిరి : మండలంలోని పాలారం, చనుపల్లి గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ మండల ఏఈ సీతారం ఆదివారం తెలిపారు. చనుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ పాలవరం ఫీడర్, 11కేవీ చనుపల్లి ఫీడర్‌కు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న కంపచెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు, అందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న సత్యనారాయణ

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం ఏపీ సీఎం చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా కోదాడ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఒరుగంటి ప్రభాకర్, మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణల ఆధ్వర్యంలో అన్నదాన వితరణ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాదెండ్ల గోపాల్‌రావు, నాయకులు కొండ పావులూరి వెంకటేశ్వరరావు, అమరవరపు శ్రీమన్నారాయణ, బీజేపీ నాయకులు జనార్దన్‌రావు, ఆశ్రమం వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టంపై నేడు అవగాహన సదస్సు

అనంతగిరి : మండలంలోని శాంతినగర్ శివారులో గల ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్‌లో ఈ నెల 21న భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.హిమబిందు ఆదివారం తెలిపారు. ఈ సదస్సు ఉదయం 11గంటలకు ప్రారంభంకానున్నట్లు, మండల రైతులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కావున మండల రైతులు అధిక సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

మే డేను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డేను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మే 1న మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సింహాద్రి, లక్ష్మి, రావుల సత్యం, కోమర్రాజు వెంకట్, నాగేంద్రబాబు, వీరబాబు తదితరులున్నారు.

ఆలయానికి శివలింగం, నంది విగ్రహం బహూకరణ



దాత కేఎల్ఎన్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న గౌడ సంఘం నాయకులు

మునగాల : మండలంలోని మాధవరం గ్రామంలో శ్రీకంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ఆలయానికి గౌడసంఘం రాష్ట్ర నాయకుడు కేఎల్ఎన్ ప్రసాద్ శివలింగం, నంది విగ్రహాలను బహూకరించేందుకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం కోదాడ పట్టణంలో ఆయనను గ్రామానికి చెందిన పలువురు గౌడసంఘం నాయకులు కలసి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

మోతె : మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామానికి చెందిన ఎస్‌కె దస్తగిరి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం మృతుడి కుటుంబానికి మాజీ ఎంపీపీ ముప్పాని ఆశాశ్రీకాంత్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం అందజేసి సంతాపం తెలిపారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉత్సవ విగ్రహాలుగా 'భగీరథ' ట్యాంక్‌లు



చిలుకూరులో నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ ట్యాంక్



మాధవగూడెంలో ..



జెర్రిపోతులగూడెంలో ..

- ఇంటింటికీ అందని తాగునీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చిలుకూరు : గ్రామాల్లోని మిషన్ భగీరథ ట్యాంక్‌లు ఉత్సవ విగ్రహాలుగా దర్శనమిస్తున్నాయి. మంచినీటిపై గ్రామాల్లో వాస్తవ పరిస్థితికి, అధికారులు చెప్పే మాటలకు పొంతన లేదు. అధికారులు మాత్రం గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ అందిస్తున్నాం, ట్యాంక్‌లు మొత్తం పనిచేస్తున్నాయని అంటూ ప్రచార ఆర్భాటం చేస్తున్నారే తప్ప ఆచరణలో సాధ్యం కావడంలేదు. మండలంలో మిషన్‌భగీరథ నిర్వహణ అధ్వానంగా ఉంది. మండల వ్యాప్తంగా ఉన్న 29ట్యాంక్‌లలో సగానికి పైగా ట్యాంక్‌లు ఉత్సవ విగ్రహాలుగా దర్శనమిస్తాయి. జెర్రిపోతులగూడెంలో ఉన్న ఒక్క ట్యాంక్‌కు కూడా నీరు రావడం లేదు. అలాగే చిలుకూరులో రెండు ట్యాంక్‌లకు, మాధవగూడెంలో ఒక ట్యాంక్‌లు, బేతవోలు మూడు ట్యాంక్‌లకు అసలు నీరుచేరని పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి మండల వ్యాప్తంగా నెలకొంది. ఎక్కడ చూసినా లీకేజీల పేరుతో గ్రామాల్లో ఇంటింటికి భగీరథ నీరు సక్రమంగా అందడం లేదు. అసలే వేసవి కాలం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై మిషన్ భగీరథ అధికారులను వివరణ కోరగా.. సాధ్యమైనంత వరకు ట్యాంక్‌లు పని చేసేలా, ఇంటింటికి నీరు అందేలా చూస్తామని తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి, దీంతో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. మిషన్ భగీరథ ట్యాంక్‌లు సక్రమంగా పనిచేసేలా చూడాలని, ఇంటింటికీ ప్రతి రోజు తాగునీరు వచ్చేలా చూడాలి. ప్రత్యేక నిధులు మంజూరు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలి.

– సిరాపురపు శ్రీనివాస్, చిలుకూరు

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి



హుజూర్‌నగర్ : బహుమతులతో విద్యార్థులు అగ్నిమాపక అధికారి, సిబ్బంది



కోదాడరూరల్ : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఫైర్ సిబ్బంది

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగిఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి పశ్య సుబ్బరాంరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వారోత్సవాల సందర్భంగా ఎన్సెస్పీ క్యాంప్ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రవిబాబు, నగేష్, నరసింహారావు, రామారావు, అమ్రూ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో క్రీడలు

కోదాడరూరల్ : అగ్నిమాప వారోత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలోని బాలాజీనగర్‌లో గల ఫైర్‌స్టేషన్‌లో ఆదివారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నపుడు చేపట్టాల్సిన నివారణ చర్యలను వివరించారు. అనంతరం క్రీడాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ ముత్తినేని శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, ప్రకాష్, శ్రీనివాస్, వీరబాబు, సురేందర్‌రెడ్డి, వెంకన్న, చిరంజీవి, మట్టయ్య, రవి ఉన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్

హుజూర్‌నగర్‌రూరల్ : వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ అన్నారు. ఆదివారం మండలంలోని అమరవరంలో ముస్లిం మైనార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 2025 వక్ఫ్ సవరణ చట్టాన్ని ఆమోదించి ముస్లిం మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. సవరించిన చట్ట ప్రకారం మైనార్టీలకు వక్ఫ్ ఆస్తులపై ఎలాంటి హక్కులు లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిందని, రాజ్యాంగంలోని 8 ఆర్టికల్స్‌ను ఉల్లంఘించే విధంగా ఉన్న 2025 వక్ఫ్ సవరణ చట్టాన్ని అందరూ వ్యతిరేకించాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ముస్లిం, మైనార్టీ, దళిత, ఆదివాసీలు వ్యతిరేక పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మజీద్ సంఘం అధ్యక్షుడు షేక్ సలీం, మజీద్ ఉపాధ్యక్షులు జానీపాషా, లతీఫ్, జానీవియా, అహ్మద్, అమీర్, సైదా, కాసిం, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుక



హుజూర్‌నగర్ : తిలక్‌నగర్ సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న పాస్టర్ ఫ్రాంక్లిన్



నేరేడుచర్ల : దిర్శించర్లలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని తిలక్‌నగర్ సీఎస్ఐ పెద్ద చర్చిలో, సెయింట్ జోసెఫ్ చర్చిలో ఆదివారం ఈస్టర్ పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలను పూల తోరణాలతో అలంకరించారు. ఏసుక్రీస్తు మరణించి మూడోరోజు పునరుద్ధానుడై జీవించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏసుక్రీస్తుని స్మరిస్తూ సంతోషంతో ప్రతిఒక్కరూ ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఫ్రాంక్లిన్, పాదర్ మారయ్య, క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

దిర్శించర్లలో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామంలో సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో శనివారం రాత్రి ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ పి.శ్యామ్ డేవిడ్ ఈస్టర్ సందేశాన్ని ఇచ్చారు. ప్రార్థనలో మాజీ జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, సంఘం కార్యదర్శి పాతకోటి రమేష్, సోమయ్య, రవి, సుధాకర్, వెంకన్న, నాగయ్య, శ్రీను, సంజీవ్, నాగరాజు, పాపయ్య, వెంకటేష్, సామేలు తదితరులున్నారు.

నడిగూడెం : మండలంలోని అన్ని గ్రామాల్లో గల చర్చిల్లో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు పాస్టర్లు బైబిల్ సందేవాన్ని బోధించారు. వేడుకలలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

హుజూర్‌నగర్ : పట్టణంలో వాసవీ క్లబ్, వాసవీ, వనితా క్లబ్ లెజెండ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సూర్యాపేటకు చెందిన కంటి వైద్యులు చారి, స్వాతి 150మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్ర లింగమ్మ జ్ఞాపకార్థం భర్త సూరయ్య శిబిరానికి వచ్చిన వారికి మజ్జిగ పంపిణీ చేశారు.

గడ్డివాము దగ్ధం

మోతె : ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఓ గడ్డివాము దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని రాఘవాపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మట్టిపల్లి గంగరాజు తన వ్యవసాయ పొలం వద్ద గడ్డి వామును ఏర్పాటు చేశాడు. ఆ గడ్డివాముకు మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. అది గమనించిన చుట్టు పక్కల రైతులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా మంటలు చల్లారకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ.20వేల విలువగల గడ్డి దగ్ధమైందని బాధిత రైతు వాపోయాడు.

అనసూర్యమ్మకు ఘన నివాళి

మునగాల : మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన సీపీఎం నాయకురాలు అనసూర్యమ్మ ఆశయసాధనకు పార్టీ కార్యకర్తలు కృషిచేయాలని పలువురు నాయకులు కోరారు. ఆదివారం మండంలోని నర్సింహులగూడెంలో నిర్వహించిన అనసూర్యమ్మ దశదినకర్మలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పార్టీ మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూరి స్వరాజ్యం, జూలకంటి విజయలక్ష్మి, షేక్ సైదా, మండల కమిటీ సభ్యులు చందా చంద్రయ్య, బోళ్ల కృష్ణారెడ్డి, వెంకన్న, పిచ్చయ్య, సైదులు ఉన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షకు 77మంది గైర్హాజరు

కోదాడరూరల్ : పట్టణంలోని ఆయా కేంద్రాలో నిర్వహించిన ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. బాలుర ఉన్నత పాఠశాలలో 224మంది విద్యార్థులకు గాను 29మంది, బాలికల పాఠశాలలో 204మంది గాను 30మంది, సీసీరెడ్డి పాఠశాలలో 236మంది విద్యార్థులకు గాను 18మంది పరీక్షలకు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఎండీ.సలీంషరీఫ్ తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌లతో పాటు ఆధార్‌కార్డులను తప్పక తీసుకరావాలని, లేకుంటే పరీక్షలకు అనుమతించరని ఆయన తెలిపారు.

ఆస్పత్రిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన తుమ్మకొమ్మ ఫ్రాన్సిస్ లలితమ్మ కుటుంబ సభ్యులు ఆదివారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ చిన్నకుమార్తె వర్షఅను ప్రియ జ్ఞాపకార్థంగా క్రీస్తు పునరుద్ధాన పండుగ ఈస్టర్‌ను పురస్కరించుకుని ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బంధువులు లలితమ్మ, కవిత, రోజమ్మ, స్వర్ణ, శేఖర్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

గరిడేపల్లి : స్థానిక సంస్థలకు వెంటనే ఎన్నికలు నిర్వహించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో స్థానికంగా ప్రజాప్రతినిధులు లేకపోవడంతో డ్రెయినేజీలు శుభ్రం చేయకపోవడం, పారిశుద్ధ్యం పేరుకుపోయి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

గోశాలకు గ్రాసం అందజేత

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల నుంచి అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో కోదాడలోని శ్రీహరహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయ గోశాలకు ఆదివారం రెండు ట్రాక్టర్ల గడ్డిని విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో దాతలు అయ్యప్ప దీక్ష ప్రచార సమితి గురుస్వాములు చిన్నపల్లి శ్రీను, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, సైదులు, సతీష్‌కుమార్, నాగయ్య తదితరులున్నారు.

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన రైతులు చలవాడి శ్రీను, తోట జోగయ్య, పాలపాటి నాగయ్యలు ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో కొలువై ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం గోశాలకు సుమారు రూ.20వేల విలువ గల 3ట్రక్కుల గడ్డిని ఆలయ అధికారులకు వితరణగా అందజేశారు. దీంతో వారికి ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఆలయ డిప్యూటీ కమిషనర్ కిషోర్‌కుమార్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

సన్నబియ్యం నిరుపేదలకు వరం



సన్నబియ్యం భోజనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునగాల : తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పథకం నిరుపేదలకు వరంగా మారిందని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కాలె సామియేల్ అన్నారు. ఆదివారం మండలంలోని కృష్ణానగర్‌లో పార్టీ నాయకుడు మిట్టగణుపుల రమేష్ నివాసంలో సన్నబియ్యంతో ఆయన భోజనం చేసి మాట్లాడారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో సన్నబియ్యం అందుతుండడంతో పేదలు కడుపునిండా తింటున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బీతం రామిరెడ్డి, మాజీ సర్పంచ్ లింగారెడ్డి, నాయకులు ఎనుగుల నాగేశ్వరరావు, లింగయ్య, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



పతకాలు అందుకున్న క్రీడాకారులు

కోదాడరూరల్ : హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన తెలంగాణ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2025 పోటీల్లో కోదాడకు చెందిన ఖ్యాతి స్పోర్ట్స్ అకాడమి క్రీడాకారులు ప్రతిభ చూపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో ఖ్యాతి అకాడమికి చెందిన పలువురు క్రీడాకారులు ఓవరాల్‌గా ద్వితీయ స్థానంలో నిలిచి పలు విభాగాల్లో పతకాలు సాధించినట్లు కోచ్ పాలడుగు ఖ్యాతి ఆదివారం తెలిపారు. సాధిక్, పవిత్ర, సౌజన్య రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలు, లక్ష్మీప్రసన్న, విజయ, మహేశ్వరీ, వర్షిత, ఖాతిజబేగం బంగారు పతకాలు, ఊహవిజేత, గౌరీ, అనూషాలు వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ రమేష్‌గౌడ్ పతకాలు అందజేశారు.

ఇంటింటికీ అంబేడ్కర్ చిత్రపటాల పంపిణీ



చిత్రపటాలు పంపిణీ చేస్తున్న ఎస్ఐ గోపరాజు

మునగాల : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని కలకోవలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకొట్ల నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ అంబేడ్కర్ చిత్రపటాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన చిర్రా గోపరాజు (మాదాపూర్ ఎస్ఐ) ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గ్రామంలో ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించాలన్నారు. యువత విద్యను మధ్యలోనే వదిలేయడంతో పెడదోవ పట్టే అవకాశం ఉందన్నారు. యువత విద్యకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. డాక్టర్ అంబేడ్కర్ రాసినటువంటి రాజ్యాంగ ఫలాలను ఆదర్శంగా తీసుకొని నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చిర్రా శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ పాతకొట్ల బాలయ్య, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మాతంగి ఏసుబాబు, స్వేరో మండల అధ్యక్షుడు గద్దల మోహన్‌కుమార్, కుడుముల వెంకటేశ్వర్లు, పాతకొట్ల లింగయ్య, మునగలేటి తిరపయ్య, కుడుముల భిక్షం, మునగలేటి శ్రావణ్, మునగలేటి విగ్నేష్, మునగలేటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కె యాకూబ్

గరిడేపల్లి : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె యాకూబ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన జీపీ కార్మికుల జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, రెండో పీఆర్సీను వర్తింపజేసి కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, వారికి ఇచ్చే కనీస వేతనం సక్రమంగా సమయానికి ఇవ్వకపోవడంతో కార్మికులు సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రమాదంలో కార్మికులు మృతి చెందితే రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, అర్హులైన వారికి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ముత్తయ్య, రాములు, గోపి, శ్రావణ్ ఉన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నేతలు

నేరేడుచర్ల : వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు కోరారు. ఆదివారం మండలంలోని దిర్శించర్ల గ్రామంలో జరిగిన సన్నాహక సమావేశంలో సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రజతోత్సవ సభకు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి మిడతపల్లి శ్రీను, పత్తేపురం వెంకటేశ్వర్లు, సైదులు, రాంబాబు, కత్తి అనిల్, నాగరాజు, జానయ్య, అంజమ్మ, రామయ్య, వసంతరెడ్డి, కోటిరెడ్డి, వెంకన్న, గురువయ్య, నాగరాజు, చిన లచ్చయ్య, తదితరులున్నారు.

ప్రహరీ నిర్మాణానికి విరాళం



విరాళందజేస్తున్న ఎంఈఓ బాలునాయక్

మఠంపల్లి : మండలంలోని కొత్తతండాలో గల శ్రీఆంజనేయస్వామి దేవాలయ ప్రహరీ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఎంఈఓ బానోతు బాలునాయక్– సుకన్య దంపతులు ఆదివారం రూ.50వేలు విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ప్రసాద్‌కు ముందుగా రూ.25వేలు నగదును అందజేశారు. అనంతరం వారు ఆలయంలో శ్రీస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్‌చైర్మన్ సైదానాయక్, సక్రునాయక్, బానోతు వెంకట్రాం నాయక్, దేశ్‌పాండు, బాబా, హజ్జా కమిటీ సభ్యుడు భీముడునాయక్ పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేస్తున్న చెట్లు

- మట్టపల్లి–హుజూర్‌నగర్ ప్రధాన రోడ్డు వెంట ఏపుగా పెరిగిన చెట్లు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



మట్టపల్లి–హుజూర్‌నగర్ రోడ్డులో మార్జిన్ కనపడకుండా కమ్మేసిన చెట్లు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి–హుజూర్‌నగర్ ప్రధాన రహదారిలో చైటపల్లి, బక్కమంతులగూడెం, త్రివేణీనగర్ తదితర గ్రామాల పరిధిలో రహదారి వెంట రెండు వైపులా నాటిన చెట్లు దట్టంగా పెరిగి రోడ్డుకు మార్జిన్ లేకుండా కమ్మేశాయి. దీంతో వచ్చి పోయే వాహనాలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, అంతే కాకుండా ఎదురుగా వచ్చే వాహనాల నుంచి తొలిగి వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఈ రహదారిపై మట్టపల్లి వద్ద కృష్ణానదిపై హైలెవల్ వంతెన ఉండడంతో ఇటు తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలు ప్రాంతాల నుంచి నిత్యం భారీ నుంచి అతిభారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా మట్టపల్లి పుణ్యక్షేత్రంతో పాటు మండలంలోని ఎన్‌సీఎల్, సాగర్ సిమెంట్స్, గ్రేగోల్డు సిమెంట్స్, అమరేశ్వరి సిమెంట్స్ పరిశ్రమలకు నిత్యం వందలాదిగా లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో మరింత రద్దీగా ఉంటుంది. ఆ రోడ్డులో ప్రయాణించే ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భారీ వాహనాలు ఎదురెదురుగా తొలిగి పోయేందుకు వీలుగా రోడ్డు వెంట ఉన్న చెట్లను తొలగించి వెడల్పు చేసి రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు వెంట చెట్లను వెంటనే తొలగించాలి

మట్టపల్లి–హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై నుంచి రాత్రింబవళ్ల రెండు రాష్ట్రాలకు చెందిన భారీ, అతిభారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు వెంట మార్జిన్ మొత్తం కనబడకుండా కంపచెట్లు కమ్మేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించాలి.

– దాసరి వెంకటరమణ మట్టపల్లి